సాక్షి నిజామాబాద్

సోమవారం । 28 । అక్టోబర్ । 2024



ప్రజా సమస్యలపై..

ప్రజా సమస్యలపై పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు.

- 8లో ▸



సంగీత సాధనకు..

బోధన్ పట్టణంలోని కోదండ రామాలయంలో ఆదివారం త్యాగరాజు కళారాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.6 /17.5

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాలో 1,160 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



వేల్పూర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సొసైటీలు, ఐకేపీ ద్వారా 1,160 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి తెలిపారు. వేల్పూర్, వెంకటాపూర్ గ్రామాల్లో ఆదివారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు చేయడానికి నిజామాబాద్ జిల్లాలో 620, కామారెడ్డి జిల్లాలో 540 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో వేల్పూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ శ్రీధర్, నాయకులు గొర్రాయి నరేందర్, దామోదర్‌గౌడ్, నల్లవెల్లి శ్రీనివాస్,కుమ్మరి రాజన్న పాల్గొన్నారు.

బీసీ కమిషన్ బృందానికి ఘన స్వాగతం



సుభాష్‌నగర్: స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఉమ్మడి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టిన తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం ఆదివారం నిజామాబాద్ నగరానికి చేరుకుంది. స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద బీసీ కమిషన్ బృందానికి జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి విచ్చేయగా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి స్రవంతి తదితరులు స్వాగతం పలికారు. కమిషన్ చైర్మన్, సభ్యులు జిల్లా అధికారులతో భేటీ అయ్యి స్థానిక పరిస్థితులపై చర్చించారు. అనంతరం బీసీ కమిషన్ బృందం బాసర పుణ్యక్షేత్రానికి వెళ్లింది. అధికారులు సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసుకుని తిరిగి నిజామాబాద్‌కు వస్తారు. ఈ నెల 29న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాకు సంబంధించి అభిప్రాయ సేకరణ జరపనున్నారు. స్వాగతం పలికిన వారిలో బీసీ అభివృద్ధి శాఖ సహాయ అధికారి నర్సయ్య, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న తదితరులు ఉన్నారు.

ఒక్క డీఏ విడుదల సరికాదు

బాల్కొండ: ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా ఒకటి విడుదల చేయడం సరికాదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యానందం, ప్రధాన కార్యదర్శి రమేశ్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే మూడు డీఏలను విడుదల చేస్తామని హామీనిచ్చి, నెరవేర్చకపోవడం సరికాదన్నారు. రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని గత పది నెలలుగా ఉద్యోగులు ఓపిక పట్టారన్నారు. కనీసం రెండు డీఏలు అయిన విడుదల చేయాలని కోరారు.



నుడాలో ఉద్యోగులేరి..?

- ప్రధాన పోస్టు మినహా అన్నీ ఖాళీలే..
- 140 పోస్టులకు ఒక్కరే రెగ్యులర్
- బల్దియా నుంచి ముగ్గురికి అదనపు బాధ్యతలు
- నలుగురు అవుట్ సోర్సింగ్ సిబ్బందితో నెట్టుకొస్తున్న వైనం
- తాజాగా నుడా పరిధిని పెంచిన ప్రభుత్వం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా)లో సిబ్బంది కొరత వేధిస్తోంది. నగరాన్ని విస్తరిస్తూ వేగంగా అభివృద్ధి చేయడానికి ఏర్పడిన సంస్థలో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. 2017 అక్టోబర్‌లో ప్రభుత్వం నుడా ఏర్పాటు చేసింది. తొలి చైర్మన్‌గా ప్రభాకర్ రెడ్డిని నియమించింది. నుడా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవపల్‌మెంట్ పరిధిలోకి వస్తుంది. నుడా కార్యాలయంలో దాదాపు 140 మంది ఉద్యోగులు ఉండాలి. ప్రభుత్వం కేవలం ఒక్క పోస్టును మాత్రమే కేటాయించింది. చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా శ్యాంకుమార్‌ను నుడాకు కేటాయించారు. సీపీవోనే నుడాకు ప్రధాన అధికారి. దాదాపు 140 మంది సిబ్బంది అవసరమయ్యే ఈ వ్యవస్థలో నలుగురితోనే నెట్టుకొస్తున్నారు. ముగ్గురు అధికారులను మున్సిపల్ కార్యాలయం నుంచి అదనపు బాధ్యతలతో తీసుకువచ్చారు. మరో ఇద్దరు సిబ్బందిని అవుట్ సోర్సింగ్ విధానంలో తీసుకున్నారు. ఒక అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్, ఇద్దరు చైన్‌మెన్‌లు, కంప్యూటర్ ఆపరేటర్‌తోనే సంస్థను నడిపిస్తున్నారు. మున్సిపల్ నుంచి టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సత్యనారాయణ, డీఈ సుదర్శన్ రెడ్డి, ఏఈ వాజిద్‌లను కార్పొరేషన్ నుంచి తీసుకుని అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్, నలుగురు అటెండర్లను అవుట్ సోర్సింగ్ విధానంలో తీసుకున్నారు.

అధికారుల దృష్టికి ..

నుడా సంస్థలో పూర్తిస్థాయి సిబ్బంది కావాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సీడీఎంఏ అధికారులు పెద్దగా స్పందించడం లేదు. 2020 నుంచి ఇప్పటివరకు లేఖలు రాసినా నియామకం జరపలేదు. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ముగ్గురికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ అధికారులు ప్రధానమైన పనులు అక్కడ చేస్తూ మిగతా సమయాల్లో మాత్రమే నుడాలో విధులు నిర్వహిస్తున్నారు. అయి తే కాంగ్రెస్ ప్రభుత్వం నుడాకు చైర్మన్‌గా కేశ వేణు ను నియమించింది. ఇటీవలే ఆయన బాధ్యతలు చేపట్టారు. చైర్మన్‌గా పూర్తిస్థాయి ఉద్యోగులుంటేనే సమర్థవంతంగా పనులు చేసే అవకాశం ఉంటుంది. దీంతో ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఉద్యోగులను భర్తీ చేస్తుందా అని చూడాలి.

విస్తృత పరిధి

నుడాకు విస్తృత పరిధి ఉంది. సంస్థ ఏర్పాటు చేసినప్పుడు నిజామాబాద్ నగరం నుంచి 40 కిలోమీటర్ల మేర పరిధి ఉండేది. 88 గ్రామాలు, 8 మండలాలున్నాయి. ఇటీవల మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం నుడా పరిధిని పెంచుతూ జీవో జారీ చేసింది. నుడా పరిధి ఇకపై జిల్లా మొత్తం కానుంది. ఇందులో 380 గ్రామాలను చేర్చింది. మున్సిపాలిటీలు భీమ్‌గల్, ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీలు కూడా దీని పరిధిలోకి వస్తాయి. నుడాలో ప్రధానంగా 4 విభాగాలున్నాయి. అడ్మినిస్ట్రేటివ్ వింగ్, అకౌంట్స్ వింగ్, డెవలప్‌మెంట్ వింగ్, చైన్‌మెన్ వింగ్ ఉన్నాయి.

నుడా పరిధిలో పలు ఉద్యోగాల వివరాలు

హోదా	పోస్టులు	ప్రస్తుతం ఉన్నవారు
అడ్మినిస్ట్రేటివ్ వింగ్		
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్	4	0
సీనియర్ అసిస్టెంట్	2	0
జూనియర్ అసిస్టెంట్	2	0
సిస్టం మేనేజర్	2	0
అకౌంట్స్ వింగ్		
డివిజనల్ అకౌంట్స్ మేనేజర్	1	0
సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్	1	0
జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్	1	0
డెవలప్‌మెంట్ వింగ్		
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్	1	0
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్	2	0
అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్	4	0
సీనియర్ అసిస్టెంట్	2	0
చైన్‌మెన్		
సీనియర్ అసిస్టెంట్	2	0
జూనియర్ అసిస్టెంట్	2	0

గతంలో లేఖలు రాశాం



నుడా ఏర్పడిన నాటి నుంచి పూర్తిస్థాయిలో ఉద్యోగులు లేరు. సీపీవో పోస్టు మాత్రమే భర్తీ చేశారు. ఖాళీలు పూరించాలని 2020లోనే ఉన్నతాధికారులకు లేఖ రాశాం. ఖాళీలు భర్తీచేయాలని మరోసారి అధికారులకు లేఖ రాస్తాం. – శ్యాంకుమార్, సీపీవో

సీఎం దృష్టికి తీసుకెళ్తా



నేను చైర్మన్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టాను. అధికారులతో రివ్యూ నిర్వహించాను. నుడాలో పూర్తిస్థాయిలో అధికారులు లేరని తెలిసింది. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి సమస్య తీసుకెళ్లి అవసరమైన ఉద్యోగులను కేటాయించాలని కోరుతాం. – కేశ వేణు, నుడా చైర్మన్

నేడు తెరుచుకోనున్న మాధవనగర్ రైల్వే గేటు

నిజామాబాద్ రూరల్: మాధవనగర్ రైల్వే గేటు వద్ద మరమ్మతు పనులు వేగంగా సాగుతున్నాయి. పనుల కోసం గేటు మూసి ఉంచిన విషయం తెలిసిందే. ట్రాక్ పునరుద్ధరణ పనులు పూర్తికాగా, రోడ్డు పనులు చేపట్టాల్సి ఉంది. ఆదివారం అర్ధరాత్రి వరకు పనులను పూర్తి చేసి సోమవారం రైల్వే గేటు తెరవనున్నట్లు అధికారులు తెలిపారు.

భారతీయ సంస్కృతికి కుటుంబ వ్యవస్థే ఆధారం

- ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ చాలక్ కాపర్తి గురుచరణం



మాట్లాడుతున్న డాక్టర్ కాపర్తి గురుచరణం

సుభాష్‌నగర్: భారతీయ జీవన విధానంలో అత్యంత ప్రాముఖ్యత కలిగింది కుటుంబ వ్యవస్థ అని, కుటుంబం ఆధారంగానే ప్రతి వ్యక్తి జీవితంలో అనేక సంస్కారాలు అలవాడుతాయని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ చాలక్ డాక్టర్ కాపర్తి గురుచరణం పేర్కొన్నారు. ఆదివారం నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ (ఏ)లోని అనంత పద్మనా భ స్వామి ఆలయ ప్రాంగణంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శ్రీ నీలకంఠేశ్వర ఉద్యోగి ప్రభాత్ శాఖ కుటుంబ మిలన్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. గురుచరణం మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోపాటు సామాజిక చింతన కూడా అవసరమన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభమై 100 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సమాజంలోని అన్ని కుటుంబాలకు తమ సిద్ధాంతాన్ని చేర్చడం కోసం కృషి చేస్తుందన్నారు. ప్రతి హిందువు ధర్మ రక్షణ కోసం కంకణదారులు కావాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఇందూరు విభాగ్ సహ కార్యవాహ వరంగంటి శ్రీనివాస్, వేంపల్లి ప్రతాప్, అట్లూరి నాగేశ్వరరావు, స్వయం సేవకుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కుల రహిత సమాజాన్ని నిర్మిద్దాం



గోదావరి నదికి హారతి అందిస్తున్న స్వామీజీలు

రెంజల్(బోధన్): కుల రహిత సమాజాన్ని నిర్మించుకుందామని పలువురు స్వామీజీలు అన్నారు. మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రంలో ఆదివారం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో లోక్‌మాత అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాల సందర్భంగా పూజ్య ధర్మాచార్యుల సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు స్వామీజీలు మాట్లాడుతు హిందూ సమాజ ఐక్యత, పరివర్తనలో ప్రధాన పాత్ర దేశంలోని సాధుసంతులదేనని పేర్కొన్నారు. దేశంలో హిందువులు జాగృతం అవుతున్నారని చెప్పారు. దేశ, ధర్మ రక్షణకు యువత ముందుండాలన్నారు. అనంతరం గోదావరి నదికి మహాహారతి అందించారు. కార్యక్రమంలో స్వామీజీలు సిద్ధేశ్వానంద, సిద్దానంద, అనంతగిరి, సంగ్రామ్ మహారాజ్, గుడిమెట్ల స్వామీజీ, యంచ మాతానంద స్వర్ణకమలాక్షితో పాటు సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్, జిల్లా గౌరవ అధ్యక్షుడు శీనునాయక్, కొత్త సృజన్‌రెడ్డి, గజానన్, నాగేష్, గంగనర్సయ్య, గణపతి, విజయ్, ఇప్పకాయల హరిదాసు పాల్గొన్నారు.

పల్లికి మంచి ధర



బుస్సాపూర్‌లో పల్లి కాయను తెంపుతున్న కూలీలు

బాల్కొండ: ఖరీఫ్ మధ్యలో వేసిన పల్లి పంట పండింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మెండోరా మండలంలోని బుస్సాపూర్ గ్రామం పల్లి సాగుకు ప్రసిద్ధి. గ్రామంలో సుమారు 300 ఎకరాల్లో పల్లి సాగు చేస్తున్నారు. 75 రోజుల్లో పల్లి పంట చేతికి రావడంతో రైతులు ప్రస్తుతం జోరుగా వెలికి తీస్తున్నారు. ఖరీఫ్‌లో మొక్కజొన్న పంటను సాగు చేసిన భూముల్లో పచ్చి బుట్ట చేతికి రాగానే రైతులు విక్రయిస్తారు. ఆ భూముల్లోనే ఖరీఫ్ మధ్య కాలంలో సెప్టెంబర్ మొదటి వారంలో పల్లి విత్తుతారు. ప్రస్తుతం పల్లి పంట చేతికి రావడంతో రైతులు భూముల్లో నుంచి తవ్వి తీస్తున్నారు.

బస్తాకు రూ.3 వేల ధర

ఈసారి పల్లికి డిమాండ్ ఉంది. కిలోకు రూ. 40 చొప్పున మార్కెట్‌లో అమ్ముడవుతోంది. దీంతో బస్తాకు రూ.3 వేలు రాబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఎకరానికి 30 బస్తాల పల్లి దిగుబడి వస్తుంది. బుస్సాపూర్ గ్రామంలోనే పల్లి మార్కెట్ అందుబాటులో ఉండటంతో రైతులకు కలిసొస్తోంది. ఇక్కడి నుంచి వ్యాపారులు పంటలు కొనుగోలు చేసి హైదరాబాద్, మహారాష్ట్ర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రస్తుతం పల్లికి ధర బాగుందని, చివరి వరకు ఇదే ధర ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

డిచ్‌పల్లి: రాష్ట్రవ్యాప్తంగా ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని ఆందోళన చేస్తున్న బెటాలియన్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడం సరికాదని ఏడో బెటాలియన్ కానిస్టుబుళ్ల అన్నారు. 39 మంది కానిస్టేళ్లలపై వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారంలోపు వారిపై సస్పెన్షన్ ఎత్తివేయకుంటే తమ ఉద్యోగాలను సైతం వదులుకొని ఆందోళన చేపడతామని పేర్కొన్నారు.

రాత్రిపూట బెటాలియన్ ప్రాంగణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సస్పెండ్ చేసిన 39 మందిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- రిపేర్లకు నిధులు మంజూరైనా పనులు చేపట్టని ప్రభుత్వం
- కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ చేయడంలో నిర్లక్ష్యం
- సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ఆయకట్టు రైతులు

‘ఎత్తిపోయని’ మోటార్లు!



గాదేపల్లి ఎత్తిపోతల పథకం



మోటార్‌కు రిపేర్లు చేస్తున్న దృశ్యం

డొంకేశ్వర్(ఆర్మూర్): ఆయకట్టు రైతులకు భరోసానిచ్చే ఎత్తిపోతల పథకాలు చతికిలపడ్డాయి. ఏళ్లనాటి మోటార్లు నీటిని ఎత్తిపోయడం లేదు. రిపేర్లకు రైతుల దగ్గర నిధుల్లేక డొంకేశ్వర్ మండలంలో పలుచోట్ల లిఫ్టులు మూతబడే స్థితికి చేరుకున్నాయి. అయితే గత ప్రభుత్వం కొత్త మోటార్ల కొనుగోలు, పైప్‌లైన్ లీకేజీలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసింది. నికాల్‌పూర్ ఎత్తిపోతల పథకానికి రూ.87.50లక్షలు, మారంపల్లి ఎత్తిపోతలకు కోసం రూ.77లక్షలు మంజూరయ్యాయి. గాదేపల్లి లిఫ్టులో మోటారు, ఇతర రిపేర్ల కోసం రూ.48లక్షలు వచ్చాయి. నిధులు మంజూరైనా ఏడాది దాటినా పనులు మాత్రం ఎక్కడ కూడా మొదలు కాలేదు. టెండర్లు పూర్తి చేసిన ఇరిగేషన్ అధికారులు గుత్తేదారులతో అగ్రిమెంట్ చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆయకట్టు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డొంకేశ్వర్ మండలంలో నికాల్‌పూర్, మారంపల్లి, డొంకేశ్వర్, గాదేపల్లి, దత్తాపూర్ కలిపి మొత్తం ఐదు ఎత్తిపోతల పథకాలున్నాయి. వీటి కింద దాదాపు 15 గ్రామాలకు సాగునీరు అందుతోంది. ఏళ్లనాటి మోటార్లు కావడంతో తరచుగా మొరాయిస్తున్నాయి. పైపులైన్లు లీకేజీలు ఏర్పడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, ప్యానల్ బోర్లు కాలిపోతుతున్నాయి. నికాల్‌పూర్, మారంపల్లి, గాదేపల్లి, దత్తాపూర్ లిఫ్టుల్లో సమస్య తీవ్రంగా ఉంది. కొన్నేళ్లుగా రైతులే తలా కొన్ని చందాలు వేసుకుని రూ.లక్షలు వెచ్చించి లిఫ్టులను రిపేర్లు చేసుకుంటున్నారు. యాసంగి సీజన్‌లో ఆయకట్టు పంటలకు సాగునీరు అందించాలంటే ప్రస్తుతమున్న మోటార్లతో సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. అయితే, అగ్రిమెంట్ స్థాయిలో నిలిచిన ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర శాఖ అధికారులను కోరినట్లు ఇరిగేషన్ ఎస్ఈ యశ్వి ‘సాక్షి’కి వివరణ ఇచ్చారు.

ప్రభుత్వం పట్టించుకోవాలి



గత ప్రభుత్వం లిఫ్టుల రిపేర్లకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించలేదు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం మరమ్మతు పనుల్లో జాప్యం చేస్తోంది. ఒకటి, రెండు మోటార్లతో యాసంగికి సాగునీటిని అందించడం సాధ్యం కాదు. ప్రభుత్వం వెంటనే కొత్త మోటార్లు బిగించాలి. – చిన్నారెడ్డి, రైతు, గాదేపల్లి

చందాలు వేసుకొని..



లిఫ్టు మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా, పైపులైన్లకు లీకేజీలు ఏర్పడినా మరమ్మతులు చేపట్టాలంటే ప్రభుత్వం నుంచి నిధులు లేవు. పంటలు గట్టెక్కించడానికి ఆయకట్టు రైతులందరం కలిసి చందాలు వేసుకుని రిపేర్లు చేసుకుంటున్నాం, రూ.లక్షల్లో ఖర్చును భరించడం రైతులకు భారంగా మారింది. – రమేశ్‌రెడ్డి, రైతు, గాదేపల్లి

క్లుప్తంగా

పటాకుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి



బోధన్‌టౌన్: దీపావళి సందర్భంగా పట్టణం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో, ఇతర ప్రదేశాల్లో ఏర్పాటు చేసే పటాకుల దుకాణాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకో వాలని ఏసీపీ శ్రీనివాస్ సూచిచారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో పటాకుల దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. పటాకుల దుకాణాలను ఏర్పాటు చేసే వారు నిబంధనలు పాటించాలని, పోలీసు, అగ్నిమా పక శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, లైసెన్స్‌లు పొందాలన్నారు. సమావేశంలో సీఐ వెంకట నారాయణ, దుకా ణాల యజమానులు పాల్గొన్నారు.

మత్తు డాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రమేశ్ ఎన్నిక


డాక్టర్ రమేశ్

ఆర్మూర్‌టౌన్: మత్తు డాక్ట ర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడి గా ఆర్మూర్‌లో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ ఎన్ని కయ్యారు. హైదరాబాద్‌లో శనివారం రాత్రి నిర్వ హించిన డాక్టర్ల సంఘం సమావేశంలో రమే శ్‌ను సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సంద ర్భంగా డాక్టర్ రమేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మత్తు డాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం రమేశ్‌కు ఆర్మూ ర్ ప్రాంత వైద్యులు అభినందనలు తెలిపారు.

పీహెచ్‌డీ పట్టా అందుకున్న అశోక్‌రావు


అశోక్‌రావు

రుద్రూర్: మండలంలోని రాయకూర్ గ్రామానికి చెందిన టి అశోక్‌రావు ఉస్మానియా యూనివర్సి టీలో పీహెచ్‌డీ పూర్తి చేసి పట్టా అందుకున్నారు. రా జనీతి శాస్త్రానికి సంబం ధించి ఆగ్నేయాసియా దేశాలతో భారత్ సం బంధాలు–లుక్ ఈస్ట్ పాలసీపై అధ్యయనం అనే అంశంపై ప్రొఫెసర్ జి రాంరెడ్డి పర్యవేక్ష ణలో పరిశోధన చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నూతన రేషన్ డీలర్లకు షాపుల కేటాయింపు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి డివిజన్ పరి ధిలోని ఆయా మండలాల్లో నూతనంగా ఎంపికై న రేషన్ డీలర్లకు నవంబర్ నెల నుంచి రేషన్ కోటాను అందజేయనున్నట్లు ఆర్డీవో రంగనా థ్‌రావు ఆదివారం పేర్కొన్నారు. భిక్కనూరు మండలంలోని గుర్జకుంట బాల రణదీప్‌రెడ్డి, కాచాపూర్ కమ్మరి వాసవి, భాగిర్తిపల్లి గొండ్ర అశోక్, భిక్కనూర్ కర్నాల శ్రీను, బస్వాపూర్ కొదండం స్వరూప, దోమకొండ మండలం లోని చింతామాన్‌పల్లి గ్రామంలో వంజరి శివ రాజు, సంగమేశ్వర్‌లో కుమ్మరి దేవేందర్, కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డిలో బాయికాడి రజితబాయి, ఏలూరి శేఖర్, కామా రెడ్డి పట్టణంలో కె నరహరి, సబ్బని జయశ్రీ, నారాయణీకర్ కల్యాణచక్రవర్తి, యాచం సం తోష్, నీల ఫణీంద్ర, బట్టు మధుకుమార్, పల్వంచ మండలం పోతారం గ్రామంలో లలిత, ఎల్పుగొండలో నాదియా సానా, రాజం పేట మండలంలో తలమడ్ల గ్రామంలో కమ్మరి దుర్గాప్రసాద్, రాజంపేటలో నాయిని రాధ, దుబ్బని నితీషాలకు నవంబర్ నుంచి రేషన్ షాపులు కేటాయించనున్నట్లు ఆర్డీవో పేర్కొ న్నారు. నూతనంగా ఎన్నికైన డీలర్లు సమయా నుకూలంగా ప్రజలతో స్నేహభావంతో ఉండి ప్రభుత్వం అందిస్తున్న సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు.

బ్రాహ్మణ్‌పల్లిలో బైక్ చోరీ

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణ్‌పల్లిలో జగడం రమేశ్‌కు చెందిన బైక్ చోరీ జరిగింది. రమేశ్ తన ఇంటి ఎదుట నిలిపి ఉంచిన బైక్‌ను దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై తిరుపతి ఆదివారం తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంగీత సాధనకు సంకల్ప బలం ఉండాలి


త్యాగయ్య కీర్తనలను ఆలపిస్తున్న స్వప్నరాణి బృందం


శతగళ త్యాగయ్య కీర్తన సంగీత కళారాధన ఉత్సవంలో సంగీత సాధకులు

- త్యాగయ్య కీర్తనలు అమూల్యం.. అమృతతుల్యం
- సంగీత కళారాధనలో వక్తలు
- కోదండ రామాలయంలో అలరించిన సంగీత కార్యక్రమం

బోధన్: సంగీత సాధనకు సంకల్ప బలం ఉండాల ని, త్యాగయ్య కీర్తనలు అమూల్యం, అమృతతు ల్యమని వక్తలు పేర్కొన్నారు. బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ ప్రాంతానికి చెందిన సంగీత విద్వాం సులు దివంగత ప్రతాప రామకృష్ణయ్య, అన్నపూ ర్ణమ్మ దంపతుల కుమారులు ప్రతాప గౌరీశంకర శాస్త్రి, శ్రీనివాస్, సత్యసాయిబాబా తమ తల్లిదం డ్రుల జ్ఞాపకార్థం ఆదివారం కోదండరామాలయం లో శతగళ త్యాగయ్య కీర్తనల సంగీత కళారాధన ఉత్సవాన్ని నిర్వహించారు.

నిజామాబాద్‌కు చెందిన జ్ఞాన సరస్వతి ప్ర భుత్వ సంగీత, పాఠశాల అధ్యాపకురాలు డాక్టర్ టి స్వప్నరాణి నేతృత్వంలో సంగీత సాధకులు వివిధ ప్రాంతాల నుంచి సంగీత వాయిద్యకారులు,


ప్రసంగిస్తున్న ప్రముఖ చరిత్రకారుడు కందకుర్తి యాదవరావు, వేదికపై న్యాయమూర్తి, టౌన్ సీఐ

విద్వాంసులు తరలివచ్చారు. ముఖ్య అతిథి, వక్తలు గా ప్రముఖ చరిత్ర పరిశోధకుడు కందకుర్తి యాద వరావు, బోధన్ కోర్టు న్యాయమూర్తి శేషతల్ప సా యి, వేణు, వాయిద్యకారుడు రాకేశ్ వైద్య, ప్రముఖ కవి కాసర్ల నరేశ్‌రావు, టౌన్ సీఐ వెంకట నారాయ ణ హాజరయ్యారు. జ్యోతి వెలిగించి సంగీత కళా సమారాధనను ప్రారంభించారు. సామూహిక కీర్తన గానాలపనతో రామమందిరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. త్యాగయ్య నోటినుంచి జాలువా రిన విభిన్న రాగాల్లో గీతాలను సంగీతకారులు ఆల పించి ఆకట్టుకున్నారు. గాయకులు ఆలపించిన కీర్త నలు విశేషంగా అలరించాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. త్యాగయ్య శ్రీరామచంద్రుడి సేవలో తరించారని, 96 కోట్ల పర్యాయాలు శ్రీరామ నామం జపించిన గొప్ప వాగ్గేయ కారుడని అన్నారు. 24 వేల రచనలు, ప్రహ్లాద భక్త విజయం, నౌకాచరిత్రం అనే సంగీత నాటక రచనలు చేశార ని, ఆయన రచించిన పంచరత్న కృతులు ఎంతో ప్రసిద్ధి పొందాయన్నారు. త్యాగయ్య కుటుంబ నేప థ్యం, సంగీతం, సాహిత్య రచనలు, జీవిత విశేషా లను కవి కాసర్ల నరేశ్‌కుమార్ వివరించారు.

సన్మానాలు

ఉత్సవంలో పాల్గొన్న సంగీత సాధకులు, అతి థులను కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా సన్మా నించారు. సంగీత, నృత్య పాఠశాల విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. రామమందిరంలో కొన్నేళ్ల క్రితం వరకు సాగిన త్యాగయ్య కీర్తనల ఆరా ధన ఉత్సవాలు ముందుముందు కొనసాగాలని, సమా జ హితం లక్ష్యంతో ఉత్సవాన్ని నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఎంవీ శర్మ, భాస్కరరాజు, నిర్వాహ కుల కుటుంబ సభ్యులు ఉదయ్ శ్రీ, దీప్తిశ్రీ, రాధ, కావ్యశ్రీ, గీతాలక్ష్మి, హేమలత, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గోలో హోం డెలివరీ

ఖలీల్‌వాడి: తెలంగాణలో ఇంటింటికి ఆర్టీసీ కార్గో ద్వారా పార్సిళ్లను అందించే సౌకర్యం కల్పించిందని ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టీసీ కార్గోలో హైదరాబాద్, జూబ్లీ బస్‌స్టేషన్‌కు సంబంధించిన 31 కౌంటర్లలో (సిటీ పరిసరాల చుట్టూ) వస్తువులను కస్టమర్స్‌కి హోం డెలివరీ అందించనున్నట్లు పేర్కొన్నారు. నిజామాబాద్‌లో హోం డెలివరీ మొదటగా డి కవిత బుక్ చేసుకున్నట్లు తెలిపారు.

హోం డెలివరీ ధరల వివరాలు

కిలో	రూపాయలు
0-1	50
1-5	60
5-10	65
10-20	70
20-30	75


ఆర్టీసీ కార్గోలో హోం డెలివరీ పార్సిల్ తీసుకుంటున్న ఆర్టీసీ అధికారులు

హోం డెలివరీల కోసం ఆర్మూర్ డిపో - 7396889496, బోధన్ డిపో - 90142 96638, నిజామాబాద్-1 డిపో-9154298727, నిజామాబాద్-2 డిపో-7396889496,బాన్సువాడ డిపో-9154298729,కామారెడ్డి డిపో-91542 98729, ఆర్ఏ ఆఫీస్-8639963647 నంబర్లను సంప్రదించాలన్నారు.

అసంపూర్తి భవనాన్ని పూర్తి చేయిస్తా

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజారెడ్డి

రెంజల్: అసంపూర్తిగా మిగిలిపోయిన రెంజల్ శాఖా గ్రంథాలయాన్ని త్వరలో పూర్తి చేయిస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి అన్నారు. ఆదివారం ఆకస్మికంగా రెంజల్ శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. పక్కా భవనం లేక అద్దె భవనంలో నెట్టుకొస్తున్నారని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన అసంపూర్తి భవనాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం అద్దె భవనంలో సాగుతున్న గ్రంథాలయాన్ని తనిఖీ చేసి కార్యదర్శి లేకపోవడంతో అసంతృప్తిని వ్యక్తం చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల కన్వీనర్ నితిన్, నాయకులు సాయిబాబాగౌడ్, పోచయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ రాజారెడ్డి

ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తాం

నిజామాబాద్ సిటీ: ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని, అందుకు కార్యకర్తలు, పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జ్యోతి, పాలడుగు భాస్కర్, రమ పిలుపు నిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో 23వ జిల్లా మహాసభ ముగింపు కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు జమిలి ఎన్నికలు తీసుకు రావాలని యోచిస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టువంటిదన్నారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాద దాడులను ప్రోత్సహిస్తోందన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు తెస్తానన్న ఎంపీ అర్వింద్ హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్రం నూతనంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడంతో కార్మికులపై పనిభారం పెరుగుతుందని వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమలో పనిచేసే వారికి


మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు భాస్కర్

ఉద్యోగ భద్రతతో అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. మహాసభలో ప్రవేశపెట్టిన తీర్మానాలను ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని తెలిపారు. సభలో పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు, నాయకులు పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, వెంకటేశ్, శంకర్‌గౌడ్, ఆనంద్, సుజాత, యేషల గంగాధర్, రామ్మోహన్ రావు, కొండ గంగాధర్, నన్నెసాహెబ్, విఘ్నేష్, జంగం గంగాధర్, శిల్పలింగం, నాయక్ వాడి శ్రీనివాస్, కటారి రాములు, నాయకులు పాల్గొన్నారు.

'ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్'పై ఛాయా చిత్ర ప్రదర్శన

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ ఆఫీస్ నిజామాబాద్ ఆధ్వర్యంలో సోమవారం 'ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్'పై ఛాయా చిత్ర ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మనాయక్ ఆదివారం పేర్కొన్నారు. రెండు రోజుల పాటు చాయా చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా త్రిమూర్తి ఎంటర్‌ప్రైజెస్ వార్షికోత్సవం

నిజామాబాద్ రూరల్: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న త్రిమూర్తి ఎంటర్‌ప్రైజెస్ వార్షికోత్సవాలను వ్యవస్థాపకుడు, యజమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తి ఎంటర్ ప్రైజెస్ ఫౌండర్ కొండా వీరశేఖర్ గుప్తా తమ దుకాణంలోని సోఫాలు, డైనింగ్ టేబుళ్లు, ఆఫీస్ ఫర్నిచర్, మంచాలు, స్టీలు, ఉడెన్ ఫర్నీచర్లు సరసమైన ధరలకు లభిస్తున్నాయని తెలిపారు. 1975లో ప్రాంభమైన త్రిమూర్తి ఎంటర్ ప్రైజెస్ నేడు 49 ఏళ్లు ముగించుకుని 50 సంవత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. నాణ్యతకు మారు పేరుగా, నాణ్యమైన ప్రమాణాలతో కుడిన ఫర్నిచర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కొండ పవన్, పవిత్ర, లక్ష్మణ్ ప్రసాద్, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో కొండా వీరశేఖర్ గుప్తా, యజమానులు

ప్రముఖ వైద్యుడు బాపురెడ్డి మృతి


బాపురెడ్డి(ఫైల్)

నిజామాబాద్‌నాగారం: ప్రముఖ వైద్యుడు, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బాపురెడ్డి(75) అనారోగ్యంతో శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. కొంత కాలంగా లివర్ క్యాన్సర్‌తో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. జిల్లాలో ఫిజీషియన్‌గా నాలుగు దశాబ్దాలుగా సేవలందించారు. కరీంనగర్ జిల్లా ఇల్లంతుకుంట మండలం అనంతగిరికి చెందిన బాపురెడ్డి బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. కేసీఆర్‌కు అత్యంత ఆప్తుడుగా ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఐఎంఏలోనూ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. బాపురెడ్డి మృతిపై పలువురు వైద్యులు, రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు. తెలంగాణ అంటే తన ప్రాణం.. తెలంగాణను ఎవరైనా విమర్శిస్తే తట్టుకోలేని శక్తి.. వ్యక్తి అతనే డాక్టర్ బాపురెడ్డి అని జేఏసీ ప్రతినిధులు గోపాల్‌శర్మ, గైని గంగారాం, భాస్కర్, ప్రభాకర్, మోహన్, నజీర్ మాధవ్ అన్నారు. ఆయనకు ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు


సమ్మేళనంలో పాల్గొన్న రెంజర్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు


ఎర్రాపహాడ్‌లో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

బాల్కొండ/ వర్ని/ రాజంపేట/ తాడ్వాయి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆదివారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు అ'పూర్వ' సమ్మేళనాలు చేపట్టారు. ముప్కాల్ మండలం రెంజర్లలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–2006, వర్ని మండలం వడ్డేపల్లి గ్రామోదయ ఉన్నత పాఠశాలలో 1981–82, రాజంపేట మండలం బసవన్నపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003–2004, తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ ఉన్నత పాఠశాలలో 2001–2002కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలు చేపట్టారు. అందరూ ఒకే చోట చేరడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు.


బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు


గ్రామోదయ పాఠశాల విద్యార్థులు


బస్వన్నపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

క్రీడా స్ఫూర్తి చాటాలి


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీవో రాజాగౌడ్

జక్రాన్‌పల్లి: క్రీడా పోటీల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని ఆర్డీవో రాజాగౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం జక్రాన్‌పల్లి మండలంలోని మునిపల్లిలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బాలికల డిగ్రీ కళాశాలలో అండర్–14, 19 క్రీడా పోటీలను ఆర్డీవో ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి, మునిపల్లి చీమన్‌పల్లి ప్రిన్సిపాళ్లు అనూష, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మోపాల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, ప్రతి విద్యార్థి క్రీడాపోటీల్లో భాగస్వాములు కావాలని బీసీ గురుకులాల ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి సూచించారు. ఉమ్మడి జిల్లాల బీసీ గురుకులాల బాలుర అండర్–14, 19 మూడు రోజుల క్రీడా పోటీలను మోపాల్ మండలంలోని కంజర్ మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్యారం, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ మురళీ, ఇన్‌చార్జి పీడీ రంజిత్, పీఈటీలు, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.


కంజర్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

క్రైం కార్నర్

రైల్వేస్టేషన్‌లో నిందితుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: రైల్వేస్టేషన్‌లో నిద్రిస్తున్న ఓ వ్యక్తి వద్ద ఉన్న రెండు ఎల్ఈడీ టీవీలను దొంగిలించిన నిందితుడిని అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. ధర్మాబాద్‌కు చెందిన మాధవప్ప ఈనెల 26న జిల్లా కేంద్రంలో 32 ఇంచులకు చెందిన రెండు ఎల్ఈడీ టీవీలను కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. రైలు ఆలస్యంగా ఉండడంతో బుకింగ్ కౌంటర్ వద్ద మాధవప్ప టీవీలను పక్కన పెట్టి నిద్రించాడు. అదే సమయంలో అక్కడే ఉన్న మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన శంకర్ నాగూరావు మాధవప్ప టీవీలను ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం ఉదయం ఒకటో నంబర్ ప్లాట్ ఫాంపై శంకర్ నాగూరావు టీవీలను చేతిలో పట్టుకొని అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఐడీ పార్టీ పోలీసులు పట్టుకొని విచారించగా టీవీలు దొంగతనం చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. ఇందులో ఆర్పీఎఫ్ సీఐ సుబ్బారెడ్డి, ఆర్ఎస్సై ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.


వివరాలు తెలుపుతున్న రైల్వే ఎస్సై సాయిరెడ్డి

ఏటీఎంలో చోరీకి యత్నించిన ఒకరి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ ఏటీఎంను ధ్వంసం చేసి చోరీకి యత్నించిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో రఘు పతి పేర్కొన్నారు. నగరంలోని బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఎస్బీఐ గోడౌన్ రోడ్డు బ్రాంచ్ ఏటీఎంను ధ్వంసం చేసి దొంగతనానికి యత్నించి న హైదరాబాద్ కు చెందిన గ్యాన్ ప్రకాశ్ చౌహాన్ ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



లింగంపేట: మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన మామిడి చిన్నమ్మ, మామిడి బాలవ్వ, మామిడి సాయిలు పొలంలో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొన్నది. ఈ ఘటనలో బాలవ్వకు గాయాలు కాగా, సాయిలుకు కాలు విరిగింది. చిన్నమ్మ తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

కారు–బైక్ ఢీకొని మరొకరికి..

బాన్సువాడ: బీర్కూర్ మండలం దామరంచ శివారులో ఆదివారం సాయంత్రం కారు–బైక్ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బీర్కూర్‌కు చెందిన అప్సర్ బాన్సువాడ నుంచి బీర్కూర్‌కు బైక్‌పై వస్తుండగా బీర్కూర్ నుంచి వస్తున్న కారు ఢీకొన్నది. ఈ ఘటనలో అప్సర్‌కు తీవ్ర గాయాలు కాగా బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

బోధన్‌రూరల్: మండలంలోని అమ్దాపూర్ శివారులో శనివారం అర్ధరాత్రి పేకాట స్థావరంపై దాడి చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.7,520 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వరి కోతలకు అద్దె భారం

- చైన్ యంత్రాలతో వరి కోతలకు ఎక్కువ ధర చెల్లిస్తున్న రైతులు
- గంటకు రూ.2,650 వరకు అద్దె
- సాధారణ యంత్రానికి రూ.1,600
- వరి క్షేత్రాల్లో బురద ఉన్న చోట చైన్ యంత్రం తప్పనిసరి

మోర్తాడ్: వరి కోతలకు అద్దె భారం పెరిగి రైతులు ఇబ్బంది పడుతున్నారు. అనేక చోట్ల వరి క్షేత్రాల్లో బురద ఉండటంతో టైర్ల యంత్రంతో కోతలు సాగడం లేదు. ఫలితంగా చైన్ యంత్రాలను అద్దెకు తీసుకుంటుండటంతో రూ.1,050 అదనంగా అద్దె చెల్లించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. సాధారణ యంత్రానికి గంటకు రూ.1,600 అద్దె చెల్లిస్తే చైన్ యంత్రానికి గంటకు రూ.2,650 అద్దె చెల్లించాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఇటీవల చిరు జల్లులు కురవడంతో కొన్ని చోట్ల వరి పంట నేలరాలింది. అలాంటి చోట చైన్ యంత్రాలు తప్పనిసరి అవసరం అవుతున్నాయి. టైర్ల యంత్రం వెళ్లలేని చోటుకు చైన్ యంత్రంతోనే వరి కోతలను కోయాల్సి రావడంతో రైతులకు అద్దె భారం పెరిగిపోతుంది. అనేక చోట్ల వరి కోత దశకు చేరుకోవడం, కొనుగోళ్లు సాగుతుండటంతో రైతులు పోటీ పడి కోతలు చేయిస్తున్నారు. చైన్ యంత్రాలను తరలించడానికి మరో వాహనం అవసరం కావడంతోనే అద్దె ధర పెంచామని వరి కోత యంత్రాల యజమానులు పేర్కొంటున్నారు. వరి కోతలకు పోటీ ఉన్న చోట అద్దెను లెక్క చేయకుండానే కోతలు కోయిస్తున్నారు. వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి ఏర్పడటంతో వరి కోతలను తొందరగా ముగించాలని రైతులు భావిస్తున్నారు.


పొలంలో వరి కోతలు చేస్తున్న చైన్ యంత్రం

అద్దె భారం తప్పడం లేదు



చైన్ యంత్రాలకు అద్దె ఎక్కువైనా భారం తప్పడం లేదు. వరి కోతలను తొందరగా ముగించాలంటే అద్దె ఎక్కువైనా భరించక తప్పడం లేదు. వరి కోతల అద్దె ధర నియంత్రణ ఎవరి చేతుల్లో లేదు. యజమానులు చెప్పినట్లు వినాల్సి వస్తోంది. – కుంట రవిశంకర్ రెడ్డి, రైతు, పాలెం